# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 15, మే 2026


### సింగరేణి అభివృద్ధికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

* మంత్రి వివేక్ వెంకటస్వామి
* సింగరేణి కొత్త గనులతో ఉద్యోగ అవకాశాలు
* కార్మికులతో కాకా కుటుంబానికి విడదీయరాని అనుబంధం



**మందమర్రి, మే 14, ప్రభాతవార్త**



సింగరేణి కార్మికులతో కాకా కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం కార్మికులు, అధికారులు సమిష్టిగా బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మందమర్రి సింగరేణి ఏరియాలోని కేకే5 గనిపై శ్రమశక్తి అవార్డు గ్రహీత ఏడుకోల పవన్‌కుమార్ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ, సింగరేణి పరిరక్షణ, అభివృద్ధికి కాకా కుటుంబం ఎప్పటికప్పుడు కృషి చేస్తూనే ఉందన్నారు. సింగరేణి సంస్థకు రూ.400 కోట్ల నిధులు ఇప్పించి లక్ష ఉద్యోగాలను కాపాడిన ఘనత కాకా వెంకటస్వామిదే అని గుర్తుచేశారు. కార్మికుల సంక్షేమం, సంస్థ బలోపేతం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కోల్ బ్లాక్ టెండర్లలో సింగరేణి సంస్థ చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకుంటోందన్నారు. కొత్త గనుల ఏర్పాటుతో సంస్థకు మరింత బలోపేతం కలగడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్కేపీ ఓపెన్‌కాస్ట్ ఫేజ్2 ప్రారంభమైతే సుమారు 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని, అవసరమైన అటవీ అనుమతులు మిగతా 2లో..

### మిషన్ భగీరథ ద్వారా మారుమూల గ్రామాలకు

# శుద్ధ జలం అందించాలి : కలెక్టర్

**కెరమెరి, మే 14, ప్రభాతవార్త:**

జిల్లాలో వేసవి కాలం దృష్ట్యా ప్రతి గ్రామానికి మిషన్ భగిరత పథకం ద్వారా శ్రద్ధ జలంను అందించాలని కలెక్టర్ కె హరిత అన్నారు. గురువారం కెరమెరి మండలంలోని ధనోరా గ్రామములోని మిషన్ భగిరత పంపు హౌస్ లను సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు పంపు హౌస్ నుండి ఎన్ని మండలాలకు త్రాగు నీరును పంపింగ్ చేస్తారని గ్రామాలకు నీరు అందుతుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా త్రాగు నీరుకు ఇబ్బందులు లేకుండా ప్రతి గ్రామానికి పంపింగ్ చేయాలన్నారు. మోటార్లు పైపు లైన్‌లు ఏమైనా లికేజిలను మర్మతులు చేసుకోవాలన్నారు. తాగు నీరును నిరంతరం సరపరా అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం కెరమెరి మండలలోని కొఠారి కోలం గూడ గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి యన్ ప్రకాష్ రావు తో కలిసి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి 110 ఇండ్లను మంజూరు చేయగా 108 ఇండ్ల పనులను ప్రారంబించడం జరిగిందని 7 ఇండ్లు పూర్తయ్యాయని అన్నారు. మిగితా ఇండ్లు వివిధ దశలో వున్నాయని ఇందులో 86 ఇండ్లు స్లాబ్ వేసేందుకు సిద్దంగా వున్నాయని అన్నారు లబ్దిదారులు తమ ఇండ్లను పూర్తి నాణ్యతతో నిర్మించుకోవలన్నారు గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రతి రోజు లబ్దిదారులతో మాట్లాడి ఇళ్ళ నాణ్యతను పరిశీలించి త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో గృహ నిర్మాణ శాఖ అధికారులు లబ్ది దారులు తదితరులు పాల్గొన్నారు.



# రూ. 1.20 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ఆసిఫాబాద్ టౌన్, మే 14, ప్రభాతవార్త**

రూ.1.20 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి శంకుస్థాపన చేశారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కొట్నాక భీం రావు చిల్డ్రన్స్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ. అహ్మద్, మునిసిపల్ కమిషనర్ తిరుపతితో కలిసి ఎమ్మెల్సీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సుమారు రూ. 1.20 కోట్ల నిధులతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్, స్మశాన వాటిక, షాదీ ఖానా, చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

* మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**లక్షెట్టిపేట, మే 14, ప్రభాతవార్త**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యంను కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని, ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం లక్షెట్టిపేట మండల తహసిల్దార్, దిలీప్ కుమార్‌లతో కలిసి రాజరాజేశ్వర రైస్ మిల్ ను సందర్శించి ప్రక్రియ పరిశీలించిన అనంతరం గాయత్రి రైస్ మిల్‌లో ఏర్పాటు చేసిన గోదామును కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిగతా 2లో..



# దొంగల బీభత్సం

* కాంగ్రెస్ నాయకుని ఇంట్లో భారీ చోరీ
* రెండు కిలోల వెండి, 75 వేల నగదుతో పరార్

**చెన్నూరు, మే 14, ప్రభాతవార్త**

దేవుడికి మొక్కులు చెల్లించడానికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి ఇల్లు గుల్ల చేశారు దొంగలు. వివరాల్లోకి వెళితే జిల్లాలోని చెన్నూరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు హిమంతరెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని హిమంతరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం దైవ దర్శనానికి తిరుపతి వెల్లామని, తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని, ఇంట్లో ఉన్న రెండు కిలోల వెండి పాత్రలు 75 వేల నగదు చోరికి గురైందని తెలిపారు. ఇంట్లోని సీసీ ఫుటేజీ ఆధారంగా మా ఇంట్లో దొంగలు పడి వెండి, నగదు దోచుకెళ్లారని అన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.



## సింగరేణి అభివృద్ధికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రేక్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రిటైర్డ్ కార్మికులకు రూ.10 వేల పెన్షన్ అందేలా ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్‌లో కృషి చేస్తున్నారని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాల పెంపు అంశాన్ని ముఖ్యమంత్రి అధ్యక్షతన త్వరలో జరిగే సమావేశంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రమశక్తి అవార్డు గ్రహీతలు ఏడుకోల పవన్‌కుమార్, పుల్లూరి లక్ష్మణ్‌లను మంత్రి శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం కార్మికులతో కలిసి రక్షణ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి జిల్లాలో గుర్తించిన గోదాములలో నిల్వ చేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం దెబ్బతినకుండా గోదాములలో నిల్వ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో లారీలు, హమాలీల కొరత, సమస్య లేకుండా ధాన్యం దిగుమతి త్వరగా పూర్తిచేసే విధంగా రైస్ మిల్లులు, లారీల యజమానులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం, గోదామును ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిన మురుగు నీరు..

# ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

హాజీపూర్, మే 14, ప్రభాతవార్త



మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల గంగ వాడలోని నాలిలోకి వచ్చే మురుగు నీరు బయటకు వెళ్ళాక, అందులోనే నిల్వ ఉంటున్నాయి. నాలీలు సరిగా శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు నిలిచి, దుర్గంధం వెదజల్లాడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీలు చెత్తతో మూసుకుపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి రాకపోకలకు అంతరాయంకలుగుతోంది. కాలనీవాసులు దుర్వాసన, దోమల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే ప్రజలు మురుగు నీటిలోనే నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. స్థానికులు పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు, నాయకులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆరోపిస్తున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నాలీలను శుభ్రం చేసి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.





# ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకం

**- భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్**

నస్పూర్, మే 14, ప్రభాతవార్త

ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ అన్నారు. గురువారం ఎంపిక చేసిన రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాలను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు, 18 సంవత్సరాలు నిండిన వారు, ఆయా నియోజకవర్గంలో సాధారణ నివాసితులు, చట్టపరంగా అనర్హులు కాని వారు ఓటరుగా నమోదు కావచ్చని తెలిపారు. యువ ఓటర్ల నమోదు, మహిళల భాగస్వామ్యం, దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఇంటింటి సర్వేలు, పోలింగ్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాలపట్టికలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, దేశ వ్యాప్తంగా గతంలో కూడా పలు మార్లు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని, అక్టోబర్ 27, 2025 నాటికి ఉన్న ఓటర్లందరికీ పాక్షికంగా పూరించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ఫారమ్‌ల సేకరణ కోసం బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని కనీసం 3 సార్లు సందర్శించేలా చూడాలని, ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1 వేయి 200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. హైరైజ్ బిల్డింగ్‌లు, మురికివాడలలో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా, ఒక కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారికి ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని కోరడం జరిగిందని, ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన తర్వాత అట్టి జాబితాను వెబ్‌సైట్‌లో, స్థానిక కార్యాలయాలలో అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపుల కోసం ఫారమ్ 6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను సమకూర్చడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నీల్వాయిలో ప్లాస్టిక్ విక్రయ కార్యక్రమం

**- ప్లాస్టిక్ వల్ల కలిగే ముప్పుపై అవగాహన కలిగించిన అధికారులు - గ్రామ ప్రజల సహకారంతో ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం**

వేమనపల్లి, మే 14, ప్రభాతవార్త



ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కార్యక్రమంలో భాగంగా గురువారం వేమనపల్లి మండలంలోని నీల్వాయి గ్రామ పంచాయతీలో చెత్తను వేరు చేయు కేంద్రం వద్ద గత కొంత కాలంగా సేకరించిన చెత్తను నీల్వాయి గ్రామ పంచాయతీలో ఒక్క చోట సమీకరించి అమ్మడం జరిగింది. ఈ సందర్భంగా డీఎల్పీఓ సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి చాలా నష్టం జరుగుతుందని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు సహాయపడాలని, ప్లాస్టిక్ ను మానవ జీవితంలో వాడకం తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల జీవకోటికి ముప్పు వాటిల్లుతుందని, ప్లాస్టిక్ వాడకంపైన ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తెలిపారు. నీల్వాయి గ్రామ పంచాయతీ సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య చేపట్టిన కిలో చక్కెరకు కిలో ప్లాస్టిక్ కార్యక్రమం వల్ల విశేష స్పందన వచ్చిందని ఇలాంటి కార్యక్రమం ప్రతి గ్రామ పంచాయతీలో చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, సర్పంచ్ లు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయికృష్ణ, కొట్రంగి శ్రీనివాస్, పున్నం, విగ్నేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే మొదటిసారి కిలో ప్లాస్టిక్ - కిలో చక్కెర కార్యక్రమం: నీల్వాయి సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య

నీల్వాయి గ్రామ పంచాయతీలో రాష్ట్రంలోనే మొదటి సారి కిలో ప్లాస్టిక్‌కు కిలో చక్కెర కార్యక్రమం చేపట్టడం వలన ఈ రోజు పట్టణాల్లో సైతం సేకరించలేని ప్లాస్టిక్ ను నీల్వాయి గ్రామ పంచాయతీ, వేమనపల్లి మండలంలో సేకరించడం జరిగిందని ఆ సేకరించిన ప్లాస్టిక్‌ను సుమారు వెయ్యి క్వింటాళ్ల ప్లాస్టిక్ ను అమ్మడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ ను నివారించాలని, భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యాన్ని అందించాలని నీల్వాయి సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య తెలిపారు.

# బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

**✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, మే 14, ప్రభాతవార్త**


2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం క్రింద 1, 5 తరగతులలో ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ లో 1వ తరగతికి 91 సీట్లు, రెసిడెన్షియల్‌లో 5వ తరగతికి 92 సీట్లు కేటాయించడం జరిగిందని, షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ నుండి జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తమ దరఖాస్తులను జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని రూమ్ నం.3 లోని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించాలని, దరఖాస్తు ఫారములు కార్యాలయ పని వేళలను పొందవచ్చని తెలిపారు. కుటుంబంలో ఒక అభ్యర్థికి మాత్రమే పథకం వర్తిస్తుందని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు జనన ధ్రువీకరణ పత్రం (మున్సిపల్ కార్పొరేషన్/ మున్సిపల్ బోర్డ్/ మీ సేవ ద్వారా జారీ చేయబడినది), 1వ తరగతి విద్యార్థులు జూన్ 1, 2020 నుండి మే 31, 2021 మధ్య, 5వ తరగతి విద్యార్థులు 4వ తరగతి బోనఫైడ్, రేషన్ కార్డు/ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించాలని, మీ సేవ ద్వారా జారీ చేయబడిన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, 3 పాస్పోర్ట్ సైజ్ కలర్ ఫోటోలు, పాఠశాల నుండి గత సంవత్సరం మార్కుల జాబితా నకలు ప్రతులు (5వ తరగతి వారికి), అన్ని నకలు ప్రతులపై గెజిటెడ్ అధికారి చే ధ్రువీకరణ సంతకం చేయించి సకాలంలో సమర్పించాలని తెలిపారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య: ఎంఈఓ మహేందర్

**సారంగాపూర్, మే 14, ప్రభాతవార్త:**

మండలంలోని పలు పాఠశాలల్లో ఎంఈఓ మహేందర్ ఆధ్వర్యంలో జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో సాంకేతిక, శాస్త్రీయ పద్ధతుల్లో బోధన సాగుతోందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న రాజేశ్వర్ రెడ్డి, అల్మాస్ ఖాన్

## మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డికి సన్మానం

**సారంగాపూర్, మే 14, ప్రభాతవార్త:**

అదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డిని సారంగాపూర్ మండల నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి నివాసంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అల్మాస్ ఖాన్, రాజేశ్వర్ రెడ్డి కలిసి ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తనకు సీనియర్ నాయకుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ పదవిని అప్పగించిన పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజన తండాల అభివృద్ధికి రూ. 15.25 కోట్ల నిధులు: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**భైంసా, మే 14, ప్రభాతవార్త:**

ముథోల్ నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 15 కోట్ల 25 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. గురువారం భైంసా పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాలు ఏర్పడినప్పటి నుండి రోడ్లు లేక గిరిజనులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 14.20 కిలోమీటర్ల మేర ఏడు రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. జీవో నంబర్ 65 ప్రకారం ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. నర్సాపూర్, కుబీర్, కుంటాల మండలాల్లోని పలు తండాలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జి ప్రిన్సిపాల్

## విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి

**- ఇంఛార్జీ ప్రిన్సిపాల్ వి. మహేశ్వర్**

**తిర్యాని, మే14, ప్రభాతవార్త**

తిర్యాని ప్రాంతానికి చెందిన తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించి సహకరించాలని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ వి. మహేశ్వర్ కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, తిర్యానిలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత మధ్యాహ్న భోజనం, స్కాలర్షిప్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యతో పాటు విద్యార్థుల భవిష్యత్‌కు అవసరమైన నాణ్యమైన బోధన, క్రమశిక్షణ, ప్రోత్సాహక వాతావరణం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల విద్యా ప్రగతి, విద్యా ప్రమాణాల పెంపు, కళాశాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



## బడిబాటలో పాల్గొన్న సర్పంచ్ అప్పల రాజలక్ష్మి రాకేష్

**భైంసా, మే 14, ప్రభాతవార్త:**

మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణ ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ అప్పల రాజలక్ష్మి రాకేష్ హాజరై మాట్లాడారు. ప్రతి చిన్నారి బడికి రావాలని, చదువు ప్రతి పిల్లవాడి హక్కు అని పేర్కొన్నారు. గ్రామంలోని బడి వయసు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు హరీష్, రాగిణి, శ్రీలత, అభిషేక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించం: మోహన్‌రావు పాటిల్

**భైంసా, మే 14, ప్రభాతవార్త:**

ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదని ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పాటిల్ హెచ్చరించారు. భైంసా మున్సిపాలిటీ కోఆప్షన్ ఎన్నిక వాయిదాను నిరసిస్తూ బీజేపీ, స్వతంత్ర కౌన్సిలర్లు చేపట్టిన నిరాహార దీక్షకు గురువారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ ఒత్తిళ్లకు లోనై ఎన్నికలను వాయిదా వేయడం అధికారుల వైఖరిని తప్పుబట్టారు. సోమవారం మధ్యాహ్నం వరకు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి, అర్ధరాత్రి వేళ వాట్సాప్ ద్వారా రద్దు సమాచారం పంపడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎంఐఎం నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఎన్నికల వాయిదాపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



## రైతు మహాధర్నాలో పాల్గొన్న మండల నాయకులు

**సారంగాపూర్, మే 14, ప్రభాతవార్త:**

నిర్మల్ ఆర్‌టీఓ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చిన రైతు మహాధర్నాలో సారంగాపూర్ మండల బీజేపీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పంటను వెనువెంటనే గోదాములకు తరలించాలని, రైతులకు గన్ని బ్యాగులు అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంటల కొనుగోలులో రైతులను మోసం చేస్తోందని, మద్దతు ధర ఇవ్వకుండా కటింగ్ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. వెంటనే పంటను కొనుగోలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రామనాథ్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్, మండల అధ్యక్షుడు కాల్వ నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# పల్లె బతుకులో చెరిగిపోని తునికి జ్ఞాపకాలు

## - అడవుల తగ్గుదల, బీడీ వినియోగం క్షీణతతో ఉపాధిపై ప్రభావం

**పెంచికల్ పేట్, మే 14, ప్రభాతవార్త :**



ఒకప్పుడు వేసవికాలం వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు తునికి ఆకు సీజన్ ఆశా కిరణంగా ఉండేది. తెల్లవారుజామునే అడవి బాట పట్టిన మహిళలు, పురుషులు, యువకులు తునికి ఆకులు కోసి జీవనోపాధి పొందేవారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, కొమరం భీం జిల్లా అడవులకు ఆనుకొని ఉన్న గ్రామాల్లో తునికి సేకరణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగంగా నిలిచేది. ప్రస్తుతం కాలమాన మార్పులు, అడవుల తగ్గుదల, బీడీ వినియోగం తగ్గిపోవడం వంటి కారణాలతో ఈ ఉపాధి క్రమంగా కనుమరుగవుతుంది. తునికి ఆకులను ప్రధానంగా బీడీ తయారీలో ఉపయోగించేవారు వేసవికాలంలో చెట్లకు కొత్త ఆకులు రావడంతో ఏప్రిల్ మే నెలలో భారీగా సేకరణ జరిగేది. గ్రామాల నుంచి వందలాది మంది కూలీలు అడవుల్లోకి వెళ్లి రోజంతా ఆకులు కోసి కట్టలుగా తయారు చేసి కట్టకు రూ. 1. 50 పైసాల నుండి రూ. 2 వరకు కాంట్రాక్టర్లకు అప్పగించేవారు. ప్రస్తుతం రూ. 3.40 పైసలు అందిస్తున్నారు. ఒక్కో కుటుంబం రోజుకు వందల రూపాయలు సంపాదించేది. పంటలు, పనులు లేని ఎండాకాలంలో ఇదే వారికి ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. ముఖ్యంగా మహిళలకు ఈ పని ఎంతో ఉపయోగపడేది. ఇంటి పనులతో పాటు అడవికి వెళ్లి ఆకులు కోసి కుటుంబానికి తోడ్పడేవారు. పిల్లలు కూడా సెలవుల్లో తల్లిదండ్రులతో కలిసి కట్టలు పేర్చడంలో సహాయం చేసేవారు. గ్రామాల్లో తునికి సీజన్ ఒక ప్రత్యేక వాతావరణాన్ని సృష్టించేది. అయితే గత కొన్ని ఏళ్లుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అడవుల్లో తునికి చెట్లు తగ్గిపోవడం, అటవీ నిబంధనలు కఠిన తరం కావడం, బీడీ పరిశ్రమ క్షిణించడం వల్ల తునికి ఆకు సేకరణ తగ్గిపోయింది. దీంతో గ్రామీణ కూలీలకు ఉపాధి అవకాశాలు కూడా తగ్గు ముఖం పట్టాయి. గతంలో తునికి ఆకుల ద్వారా నెల రోజులపాటు ఉపాధి పొందిన కుటుంబాలు ఇప్పుడు ఉపాధి హామీ పనులు, ఇతర కూలి పనులపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన కొనసాగుతోంది. గ్రామీణ పెద్దలు మాత్రం ఒకప్పుడు తునికి సీజన్ అంటే గ్రామమంతా సందడిగా ఉండేది ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తునికి ఆకుల సేకరణకు ప్రోత్సాహం కల్పిస్తే గ్రామీణ పేదలకు మళ్లీ ఉపాధి లభించే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు పేద కుటుంబాల బతుకుతెరువుకు ఆధారంగా నిలిచిన తునికి ఆకు సేకరణ ఇప్పుడు జ్ఞాపకంగా మారుతుంది. ఉపాధి కోసం అడవి బాట పట్టిన రోజులని గ్రామీణలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు.



లక్కి ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న కలెక్టర్ కే హరిత

## గిరిజన విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తాం

**ఆసిఫాబాద్, మే 14, ప్రభాతవార్త :**

గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఉన్నత ప్రమాణాలతో కూడిన పాఠశాలలో విద్యను అందిస్తామని కలెక్టర్ కే హరిత అన్నారు. గురువారం సమీకృత కల్లెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ అద్వర్యంలో 202627 విద్యా సంవత్సరానికి 3, 5 ,8 తరగతుల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం క్రింద లక్కి ద్వారా ఎంపిక కార్యక్రమానికి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన పిల్లలకు బెస్ట్ అవైలబుల్ స్కీం క్రింద ఉన్నత ప్రమాణాలు కలిగిన పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు విద్యా భోదనను అందిస్తామని కలెక్టర్ అన్నారు. మొత్తం 56 సీట్లల్లో పివిటిజి విద్యార్థులకు 5 సీట్లు, ఏజెన్సి విద్యార్థులకు 5 సీట్లు కేటాయించగా మిగిత 46 సీట్ల ను లక్కి డ్రా ద్వారా 3వ తరగతిలో 29 మంది, 5వ తరగతిలో 14 మంది, 8వ తరగతిలో 13 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమములో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, అధికారులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి

### - మంచిర్యాల డిసిపి. భాస్కర్

**లక్షెట్టిపేట, మే 14, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ మిల్లర్లను సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో రైస్ మిల్లులను ఎసిపి ప్రకాష్ తో కలిసి సందర్శించారు. తాసిల్దార్ దిలీప్ కుమార్ తో కొనుగోలు కేంద్రాల ప్రక్రియ, కొనుగోలు చేసిన ధాన్యం నిలువచేసే గోదాముల వివరాలు, రైస్ మిల్లుల యజమానులతో మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంట వెంటనే మిల్లరు దింపుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో దాన్యం ఉండకుండా అధికారులు సైతం ధాన్యాన్ని లారీల్లో గాని, ట్రాక్టర్లలో గాని రైస్ మిల్ కు గోదాములకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరం మేరకు గన్ని బ్యాగ్స్ టార్పాలిన్లు కూడా అందుబాటులో ఉంచుకోవాలని కేంద్రంనిర్వాహకులకు అధికారులు తెలుపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దిలీప్ కుమార్, సీఐ రమణమూర్తి, ఎస్సై సురేష్ తోపాటు మిల్లర్లు, కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

## పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన దివ్యాంగురాలు భీమ్ బాయి

**కుబీర్, మే 14, ప్రభాతవార్త:**

అంగవైకల్యం విజయానికి అడ్డుకాదని కుబీర్ మండలం అంతర్ని గ్రామానికి చెందిన దివ్యాంగురాలు జాదవ్ భీమ్ బాయి నిరూపించారు. భైంసాలోని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేసిన ఆమె, వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్ సీటు సాధించారు. తొలుత దివ్యాంగురాలు కావడంతో సీటు నిరాకరించినా, ఉన్నతాధికారులను సంప్రదించి తన హక్కును సాధించుకోవడం విశేషం. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో దివ్యాంగుల కోటాలో నర్సింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. హైదరాబాద్‌లో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. భీమ్ బాయి విజయం పట్ల కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, సొసైటీ అధ్యక్షురాలు ప్రసన్న రాణి, ప్రిన్సిపల్ సాయినాథ్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఆమె పట్టుదల ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



నియామక పత్రం అందుకున్న భీమ్ బాయి



## మనమంతా ప్రగతిపథంలో నడుద్దాం: ప్రిన్సిపల్ షబానా తరన్నం

**నేరడిగొండ, మే 14, ప్రభాతవార్త:**

నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నాలుగవ రోజు సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ షబానా తరన్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని, విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో నైపుణ్యం సాధించేలా చూడాలని సూచించారు. పూర్వ విద్యార్థులు తాము ప్రభుత్వ కళాశాలలో చదువుకుని ఉద్యోగాలు సంపాదించిన అనుభవాలను పంచుకున్నారు. హెల్త్ సూపర్వైజర్ సంతోష్ కుమార్ వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అందరూ కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఉపేందర్ రెడ్డి, మమత, ప్రవీణ్, గ్రామ పెద్దలు పూజ, నీలబాయి, రాములు పాల్గొన్నారు.

## నేడు నేరడిగొండలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నేరడిగొండ, మే 14, ప్రభాతవార్త**

తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నేరడిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో శుక్రవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. 2026 సీజన్‌కు గాను ఏర్పాటు చేసిన ఈ కేంద్రానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 8:30 గంటలకు ప్రారంభోత్సవం చేస్తారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతు సోదరులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సెంటర్ ఇంచార్జ్ గోలి స్వామి కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం రైతులు తమ పంటను విక్రయించుకోవాలని సూచించారు.

## సిరిపెల్లి తండాలో మొదటి ఎంబీబీఎస్ పట్టా పొందిన అడే సతీష్

**కుబీర్, మే 14, ప్రభాతవార్త:**

మండలంలోని మారుమూల గ్రామమైన సిరిపెల్లి తండా (3)కు చెందిన అడే సతీష్ వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గ్రామంలో మొదటి డాక్టర్ కావడంతో గ్రామస్తులు సతీష్‌ను పెద్ద ఎత్తున అభినందిస్తూ శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా జాదవ్ విశాల్ నాయక్ మాట్లాడుతూ అడే సతీష్ తండ్రి అడే హరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సతీష్ సాధించిన విజయం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాదవ్ విజయ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అడే సతీష్‌ను శాలువాతో సత్కరిస్తున్న గ్రామస్తులు



ముస్సిపల్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

## పట్టణ అభివృద్ధి, రైతు సంక్షేమమే లక్ష్యం: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, మే 14, ప్రభాతవార్త:**

జిల్లా అభివృద్ధి, రైతు సంక్షేమంపై కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం కలెక్టరేట్‌లో వరుస సమీక్షలు నిర్వహించారు. మున్సిపల్ అధికారులతో జరిగిన సమావేశంలో పారిశుద్ధం, తాగునీటి సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే చెత్త సేకరణ పూర్తి చేయాలని, వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీలను శుభ్రం చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం వ్యవసాయ టాస్క్‌ఫోర్స్ సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. ఎరువుల కొరత లేకుండా చూడాలని, యూరియా సరఫరాలో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ పాల్గొన్నారు.




పోడు భూముల సమస్యలపై గ్రామస్థులతో చర్చిస్తున్న అటవీ అధికారులు

## అడవుల రక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

**చింతలమానేపల్లి, మే 9, ప్రభాతవార్త**

అటవీ అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణలో గ్రామల ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కాగజ్‌నగర్ ఎఫ్.డీ.ఓ అప్పయ్య కోరారు. గురువారం కర్జవెల్లి, దిందా బీటు పరిధిలోని పోడు భూముల సమస్యలపై గ్రామస్థులతో అటవీ అధికారులు సమావేశమయ్యారు. అడవుల రక్షణకు సహకరించే రైతులకు అటవీ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రైతుల సందేహాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవలని ఆయన తెలిపారు. ఇకపై కొత్తగా అటవీ భూముల ఆక్రమణలకు పాల్పడబోమని, అడవుల సంరక్షణకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఈ సందర్భంగా రైతులు అధికారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి ఎ.సుభాష్, అటవీ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మందమర్రి ప్రాంతంలో బొగ్గు ఉత్పత్తి పెంపుపై దృష్టి

## 2026-27 లక్ష్యాలు ఖరారు

**మందమర్రి, మే 14, ప్రభాతవార్త**



మల్టీ డిపార్ట్‌మెంటల్ మీటింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను, లక్ష్యాలను, ప్రణాళికలను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మందమర్రి జీఎం కార్యాలయంలో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ మీటింగ్ ద్వారా వివిధ శాఖల మధ్య సమన్వయం మరియు అభివృద్ధి పనుల వేగవంతం గురించి చర్చించారు. మందమర్రి ప్రాంతంలో బొగ్గు ఉత్పత్తి మరియు రవాణా పెంపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ విభాగం రూపొందించిన నివేదికలో 2025-26 సంవత్సర ఫలితాలు, 2026-27 లక్ష్యాలు మరియు భవిష్యత్ ప్రణాళికలు వివరించారు. 2025-26 సంవత్సరంలో మొత్తం 580.04 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదైంది. ఇందులో భూగర్భ గనుల నుండి 41.38 లక్షల టన్నులు, ఓపెన్‌కాస్ట్ గనుల నుండి 538.66 లక్షల టన్నులు ఉత్పత్తి అయ్యాయి. ఈ ఏడాది లక్ష్యం 620.67 లక్షల టన్నులు కాగా, దానితో పోలిస్తే సుమారు 5.73 శాతం తక్కువగా ఉత్పత్తి జరిగింది. అలాగే 3678.98 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్ తొలగింపు నమోదు చేశారు. ఇక 2026-27 సంవత్సరానికి 650 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించారు. ఇందులో భూగర్భ గనుల నుండి 64.70 లక్షల టన్నులు, ఓపెన్‌కాస్ట్ గనుల నుండి 585.30 లక్షల టన్నులు ఉత్పత్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. అదనంగా 4630 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్ తొలగింపు మరియు 680 లక్షల టన్నుల బొగ్గు రవాణా లక్ష్యంగా పెట్టుకున్నారు. 2025-26లో మొత్తం లక్ష్య సాధన శాతం 81 శాతం గా నమోదైంది. భూగర్భ గనుల్లో 58 శాతం, ఓపెన్‌కాస్ట్ గనుల్లో 83 శాతం సాధన జరిగింది. భూగర్భ గనుల్లో కేకే5 ప్రధానంగా కొనసాగుతుండగా, కొన్ని గనులు మూసివేయబడ్డాయి. కేకే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌లో సుమారు 71 శాతం ఉత్పత్తి సాధించారు. భవిష్యత్తులో గనుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఆధునిక పరికరాల వినియోగం, ఎస్ డి ఎల్ లు, ఎలక్ట్రిక్ వాహనాలు మరియు ఓ ఎమ్ ఎస్ విధానాలను అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

### సింగరేణి గనుల్లో ఆధునిక యాంత్రికత ఉత్పత్తి, సంక్షేమంలో పురోగతి...

సింగరేణి గనుల్లో ఆధునిక యాంత్రిక పద్ధతుల వినియోగం ద్వారా ఉత్పత్తి సామర్థం గణనీయంగా పెరుగుతోంది. భూగర్భ గనుల్లో సిసి డ్రిల్స్, ఎస్‌డిఎల్‌లు, ఎల్‌హెచ్‌డిలు, కంటిన్యూస్ మైనర్ వంటి యంత్రాల వినియోగంతో పనులు వేగవంతమవుతున్నాయి. మొత్తం 113 సిసి డ్రిల్స్‌లో 70 యంత్రాలు ప్రస్తుతం వినియోగంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఉపరితల గనుల్లో డ్రాగ్‌లైన్, షవెల్స్, డంపర్లు, దోజర్లు వంటి భారీ యంత్రాల సహాయంతో తవ్వకాలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. యంత్రాల సమయాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆర్థిక పరంగా చూస్తే భూగర్భ గనుల్లో టన్నుకు రూ.11,198 ఖర్చు అవుతుండగా, ఉపరితల గనుల్లో ఇది రూ.4,410 మాత్రమే ఉంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి సాధించేందుకు కొత్త గనులు అభివృద్ధి దశలో ఉన్నాయి. కొత్తగూడెం1, 2, కేకే5 వంటి ప్రాజెక్టులు త్వరలో ఉత్పత్తికి సిద్ధం కానున్నాయి. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత పరంగా మంచి గుర్తింపు పొందింది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా సరఫరా చేస్తూ మార్కెట్లో స్థిర స్థానం సంపాదించింది. ఇక ఉద్యోగుల సంక్షేమం విషయంలో కూడా సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఆరోగ్యం, విద్య, గృహ సదుపాయాల వంటి పథకాలను అమలు చేస్తూ సిపిఆర్‌ఎంఎస్ ద్వారా వైద్య సేవలు అందిస్తోంది. అదనంగా, సి ఎస్ ఆర్ కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణ, ప్లాంటేషన్, జల సంరక్షణ, కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు మరియు యువతకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టి నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

### గనుల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టం...

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో గనుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. గనుల్లో పనిచేస్తున్న సిబ్బందికి భద్రతా ప్రమాణాలు పెంచేందుకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఎస్ఎంపి), మైన్ డిజైన్ సిస్టమ్, టూల్ బాక్స్ స్పీచ్ వంటి పద్ధతులు అమలు చేస్తున్నారు. మైనింగ్ మరియు డీజిల్ సంబంధిత శిక్షణలను సిబ్బందికి అందుబాటులో ఉంచి, ప్రమాదాలు నివారించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గనుల్లో సంభవించే భూగర్భ ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించేందుకు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ గనుల్లో 6 రకాల ప్రమాదాలను గుర్తించి వాటి నివారణకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. డ్రిఫ్ట్ గనులు మరియు సురంగాల్లో ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉండటంతో అక్కడ అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక మానవ వనరుల పరంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో ప్రస్తుతం 2146 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో 1138 మంది మైనింగ్ కార్యకలాపాల్లో నేరుగా పాల్గొంటూ వివిధ విభాగాల్లో సేవలు అందిస్తున్నారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కూడా సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు యంత్రాల వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నారు. భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తూ, సంస్థ లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సమిష్టిగా పనిచేస్తున్నారు.

## పార్డి సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక

**కౌటాల, మే 14, ప్రభాతవార్త**



మండలంలోని పార్డి గ్రామ సర్పంచ్ మాడవి చందు ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ సర్పంచ్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, గ్రామీణాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలకు ఆకర్షితులై మాడవి చందు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న వివిధ ప్రజా కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. పార్డి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం జానకి రామ్, మండల అధ్యక్షుడు నికోడే గంగారాం నాయకులు, గణపతి, కార్యకర్తలు పాల్గొన్నారు

## 15న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

**కాగజ్‌నగర్ రూరల్,మే 14, ప్రభాతవార్త :**




ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారం, పెండింగ్ వేతనాల విడుదల, పని దినాల పెంపు, కార్మిక వ్యతిరేక విధానాల రద్దు తదితర డిమాండ్ల సాధన కోసం మే 15న నిర్వహిస్తున్న గ్రామీణ బంద్‌ను ప్రజలు, కార్మికులు, రైతులు, యువత పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, బోర్కుట్ రాజేందర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తెలిపారు. గ్రామీణ పేదల జీవనోపాధిని కాపాడేందుకు ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి, పని చేసిన కూలీలకు వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలి. ప్రతి కుటుంబానికి రూ. 200 రోజుల పని, కనీస వేతనం రూ. 600 ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తూ గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని కోరుతున్నాము.

# ప్రతి నిరుపేదకు ఇల్లు కట్టించి ఇవ్వడమే కాంగ్రెస్ లక్ష్యం

- మంత్రి వివేక్ వెంకటస్వామి - దేవులవాడలో నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి

- పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టీకరణ

**కోటపల్లి, మే 14, ప్రభాతవార్త**



కోటపల్లి మండలంలోని దేవులవాడ గ్రామంలో రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గూడు లేని ప్రతి నిరుపేదకు పక్కా ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత తమ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నిరుపేదలు ఇబ్బందులు పడ్డారని, కానీ ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేరుస్తామని, దేవులవాడతో పాటు మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



భూమి పూజ చేసిన ఎమ్మెల్సీ దండే విఠల్

## 10 లక్షల రూపాయలతో శ్రీ మాతాజీ సహజ యోగ ధ్యాన కేంద్రం భవనం

**కౌటాల, మే 14, ప్రభాతవార్త**

మండలం తాటిపల్లి బండల్ హేట్టి గ్రామంలో రూ లక్షల వ్యయంతో నిర్మించనున్న శ్రీ మాతాజీ సహజ యోగ ధ్యాన కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ శ్రీ దండే విఠల్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ, ఆధునిక జీవన విధానంలో మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవితం కోసం యోగా, ధ్యానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించే లక్ష్యంతో ఈ ధ్యాన కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల వారికి సహజ యోగ శిక్షణ, ధ్యాన కార్యక్రమాలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. గ్రామాభివృద్ధితో పాటు ప్రజల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహజ యోగ సాధకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అత్తారింట్లో అల్లుడు హఠాణ్మరణం

**వేమనపల్లి, మే 14, ప్రభాతవార్త**



దహేగాం మండలం గిరవెల్లి గ్రామానికి చెందిన దందేర రాకేష్ (29) అనే వ్యక్తి వేమనపల్లి మండలంలోని ముల్కలపేట గ్రామంలో అత్తగారింట్లో గురువారం ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో హఠాత్తుగా మరణించాడు. మృతుడి తండ్రి దందేర వెంకన్న నీల్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని, మరణానికి గల పూర్తి కారణాలు పోస్టుమార్టం నివేదిక, విచారణ అనంతరం వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

## హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా సిద్ధంశెట్టి సాజన్

**బెల్లంపల్లి, మే 14, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి బస్తికి చెందిన సిద్ధంశెట్టి సాజన్‌ను మందమర్రి ఏరియా హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్ఎంఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాజన్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవ సమావేశాలు

**బెల్లంపల్లి, మే 14, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఘనంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు సందర్భంగా గురువారం విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పూర్వ విద్యార్థులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఇంటి వద్ద విద్యార్థుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. అలాగే కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ కంబాల మురళీకృష్ణ తదితర పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు.


### రక్తదానం ప్రాణదానంతో సమానం..

విద్యా వారోత్సవాల సందర్భంగా రక్తదాన ప్రాముఖ్యతపై ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బందికి అవగాహన కల్పించారు. రక్తదానం ద్వారా ప్రాణాపాయంలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తదుపరి ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలలోని సైన్స్ ల్యాబ్‌లు, తరగతి గదులను ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది సందర్శించి, వాటి నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. సదుపాయాల మెరుగుదలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపరింటెండెంట్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## కెరమెరి తహసీల్దార్‌గా పుల్లెంల నాగార్జున్ బాధ్యతల స్వీకరణ

**కెరమెరి, మే 14, ప్రభాతవార్త:**



కెరమెరి మండల నూతన తహసీల్దార్‌గా పుల్లెంల నాగార్జున్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. పుల్లెంల నాగార్జున్ కరీంనగర్ జిల్లా సైదాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందారు. అనంతరం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కెరమెరి మండలానికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా రెవెన్యూ సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. భూ సమస్యలు, ధరణి సంబంధిత అంశాలను నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## కేజీబీవీ మరమ్మతులకు రూ. 68 లక్షలతో భూమిపూజ: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, మే 14, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూ. 68 లక్షలతో చేపట్టనున్న మరమ్మతు పనులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. నాబార్డ్ నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినుల సౌకర్యార్థం పాఠశాలలో నూతన గదులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివంగత అధికారి కుటుంబానికి రూ.22.69 లక్షల ఆర్థిక సహాయం

**బెల్లంపల్లి, మే 14, ప్రభాతవార్త**

కైరగూడ ఓసిలో అదనపు మేనేజర్‌గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లింగాల భాస్కర్ కుటుంబానికి సింగరేణి అధికారులు మానవత్వాన్ని చాటారు. గురువారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.22 లక్షల 69 వేల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న అధికారులు స్వచ్ఛందంగా చందాలు సమీకరించి ఈ మొత్తాన్ని సేకరించడం విశేషం. జీఎం తో పాటు ఏరియా సీఎంఓఏఐ ప్రతినిధులు, హెచ్ఓడీలు కలిసి మృతుని కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ఓ టు జీఎం ఎన్. ఉమాకాంత్, ఏరియా సీఎమ్ఓఏఐ ప్రతినిధులు ఉజ్వల్ కుమార్ బెహరా, బి. వీరన్న, డీజీఎం (సివిల్) ఎస్‌కే మదీనా బాషా, సర్వే అధికారి ఆఫ్సర్ పాషా, డీవైపీఎం ఎస్‌వీ రాజేశ్వర్ రావు తదితర విభాగాధిపతులు పాల్గొన్నారు.



# ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఏర్పాట్లకు చర్యలు

ఆసిఫాబాద్,

మే 14, ప్రభాతవార్త :



జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కొరకు అవసరమైన ఏర్పాట్లను చేపడుతున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరితా అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో న్యూ డిల్లి లోని చీఫ్ ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుండి ముఖ్య ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ మువరాజ్ మార్మాట్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ హాజరైయ్యారు ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో చేపట్టే ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కొరకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూత్ స్థాయి అధికారులు సూపర్ వైజర్లను నియమించి శిక్షణ అందిచాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిదులతో సమావేశం ఏర్పాటు చేసి ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయలని, రాజకీయ పార్టీల నుండి భూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను తీసుకోవాలన్నారు. నెలాఖరు వరకు ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. బుత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటింటికి తిరిగి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను చేపడుతున్నరన్నారు. సవరణ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు బుత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందిస్తారని, ప్రతి ఓటర్ అవసరమైన పత్రాలను జతపర్చి తిరిగి బుత్ స్థాయి అధికారులకు అందజేస్తారన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమములో ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# రైతు వేదికలో రైతులకు శాస్త్రవేత్తలతో అవగాహన

లక్షెట్టిపేట, మే 14, ప్రభాతవార్త



ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం రోజు వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సంయుక్తంగా మండలంలోని జండా వెంకటాపూర్ రైతు వేదికలో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రధాన శాస్త్రవేత్త లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ... రైతులు సేంద్రియ పద్ధతులు అవలంబించి పంట యొక్క నాణ్యతను పెంచడం, నెల యొక్క సారవంతాన్ని పెంచడం, సేంద్రీయ పద్ధతిలో చీడపీడల నివారణపై, యూరియా అధికంగా వాడడం వల్ల కలిగే నష్టాలు, వివిధ పంటలను ఆశించే చీడ పీడల నివారణ పై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త శిరీష వరి, పత్తి, మొక్కజొన్న పంటల సాగులో అవలంబించవలసిన మెలకువలను రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి పి. గోవర్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 14, ప్రభాతవార్త

2026-27 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ లోని బేగంపేటలో గల హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం కొరకు షెడ్యూల్ కులములకు చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 2 సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు జిల్లా నివాసులై ఉండి జూన్ 1, 2019 నుండి మే 31, 2020 మధ్య జన్మించి ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా మీసేవ/ మున్సిపల్ కార్పొరేషన్/ తహసిల్దార్ ద్వారా జారీ చేయబడి ఉండాలని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాలలో 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, జనన తేదీ, నివాస ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జత చేసి ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని, జూన్ 1వ తేదీన డ్రా పద్ధతిన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్ అభివృద్ధి శాఖ కార్యాలయంలో పనివేళలలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.




బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ వాసాల ప్రభాకర్

# ప్రభుత్వ బడి విద్యార్థులకు బంగారు ఒడి

## - మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ - జీడీచేను గ్రామంలో ఘనంగా బడిబాట కార్యక్రమం

## - 12 మంది విద్యార్థుల అడ్మిషన్లు

కాగజ్‌నగర్ రూరల్ ,మే 14, ప్రభాతవార్త :

ప్రభుత్వ బడి విద్యార్థులకు బంగారు ఒడిఅని కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అన్నారఉ. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు – ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట మండల స్థాయి కార్యక్రమం గురువారం జీడీచేను గ్రామంలోని ఎంపీపీఎస్ జీడీచేను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివకేశవ ఆలయం నుండి పాఠశాల వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేర్పులు పెంపొందించడం, నాణ్యమైన విద్యపై గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య వంటి అనేక సౌకర్యాలు ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. గ్రామ సర్పంచ్ రాజేందర్ నాయక్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి విద్యే బలమైన పునాదని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి చిన్నారి విద్యను అభ్యసించేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు.స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ అనురాధ భాయ్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఉప సర్పంచ్ కర్ల లావణ్య మాట్లాడుతూ ప్రతి పిల్లవాడిని బడిలో చేర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుల్లూరి బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుగుణంగా విద్యాబోధన జరుగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో 12 మంది విద్యార్థులు లీశిశీ జీడీచేను పాఠశాలలో అడ్మిషన్లు తీసుకున్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, అక్షిత, భవాని, వార్డ్ సభ్యులు శ్వేత, శ్రీకాంత్, రామయ్య, గంగన్న, రాజేష్, సరిత, కళావతి, మమత, సుజాత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో నీట్ పేపర్ లీక్‌పై నిరసనలు

## - బెల్లంపల్లిలో మోడీ, ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మల దహనం

బెల్లంపల్లి, మే 14, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద నీట్ పేపర్ లీకేజీ ఘటనపై ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్ రాజు, యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ కారణంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు సంక్షోభంలో పడిందన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో వరుసగా పేపర్ లీకులు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత పదేళ్లలో 89 పేపర్ లీకులు జరిగాయని, 48 సార్లు మళ్లీ పరీక్షలు నిర్వహించాల్సి వచ్చిన పరిస్థితి దేశానికి అవమానకరమని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ముద్దం శివ ప్రసాద్, ఉపాధ్యక్షుడు చిలుముల సాయి కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు రామిల్ల ప్రదీప్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయి కుమార్, మండల ఉపాధ్యక్షుడు కాంపెల్లి పవన్, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు హాజీబాబా, కన్నెపల్లి మండల అధ్యక్షుడు ప్రణయ్, భీమిని మండల అధ్యక్షుడు ఎటకారి రాజు, తాండూర్ మండల ప్రధాన కార్యదర్శి కోయిల్ తదితర నాయకులు సజ్జు, దీక్షిత, సోను పాల్గొన్నారు.